జిల్లా దశ
నిజం.. నిర్భయంగా..
గురువారం
24-09-2026






# SIR–2026పై అధికారుల ప్రత్యేక దృష్టి

❖ *పారదర్శకంగా.. పొరపాట్లకు తావులేకుండా ఓటర్ల జాబితా సవరణ*



**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ SIR-2026 ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం, కుర్షి కాలనీ, శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించిన ఆయన క్షేత్రస్థాయిలో SIR ప్రక్రియను పరిశీలించారు. ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్, No Mapping, Anomalies వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హులు, డూప్లికేట్ ఎంట్రీలు, చిరునామా మార్పులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

# గణేష్‌ఉత్సవాలు ఐక్యతను చాటుతాయి

❖ *మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్*



**దశ, కోదాడ:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు మనలో ఐక్యతను, స్నేహభావాన్ని పెంచుతాయని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని రంగాధియేటర్ చౌరస్తా నందు, గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గత 9 రోజులు ఘనంగా పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనానికి శోభయాత్రగా తరలి వెళుతున్న భక్తులకు, కిద్మాత్ చరిత్రబుల్ ట్రస్టు, కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, పలువురు భక్తులకు స్వయంగా ఆయనే మంచినీళ్లను అందించారు. ఈ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల భక్తులకు ముస్లిం సోదరులు కుల మతాలకు అతీతంగా మంచినీళ్లను అందించడానికి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఊరేగింపు ఉత్సవాలలో పాల్గొన్నపలువురు మహిళలు గణేశుడి రథాల ముందు బ్యాండ్ మేళం దరువులకు, కోలాటం ఆడుతుండగా మల్లయ్య యాదవ్ వారితో కలిసి కోలాటం వేస్తూ మహిళలను మరియు భక్తుల్ని ఉత్సాహపరిచారు.


# మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆర్థిక మూలాలపై ఈగల్ ఫోర్స్ దాడి

❖ *రూ.25 లక్షల విలువైన వాహనాల జప్తు.. 'ఫాలో ది మనీ'పై దృష్టి*



**దశ, హైదరాబాద్:** మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు డ్రగ్స్ ద్వారా సమకూరిన అక్రమ ఆస్తులపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2021లో నమోదైన ఓ ఎన్‌డీపీఎస్ కేసులో నిందితులకు సంబంధించిన సుమారు రూ.25 లక్షల విలువైన వాహనాలను జప్తు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేసు నం.136/2021కు సంబంధించి ఎన్‌డీపీఎస్ చట్టం1985లోని 8(సీ)తో పాటు 22(బీ)(2)(సీ), 27(ఏ), 29 సెక్షన్ల కింద కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా నిందితుల నుంచి సుమారు 50 కిలోల గంజాయి, రూ.25 లక్షల విలువైన డ్రగ్స్‌తో పాటు మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఆ కేసులో డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా సమకూరిన ఆస్తులపై దర్యాప్తు చేపట్టిన అధికారులు మహీంద్రా XUV500, టయోటా ఇన్నోవా, టీవీఎస్ జూపిటర్ వాహనాలను గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68(ఎఫ్) కింద 22.09.2026న వాహనాలను జప్తు చేశారు. డ్రగ్స్ కేసుల్లో కేవలం మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా వాటి ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలను గుర్తించి అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకునే దిశగా ఈగల్ ఫోర్స్ చర్యలు చేపడుతోంది. "ఫాలో ది మనీ" విధానంలో డ్రగ్స్ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై దర్యాప్తు కొనసాగిస్తోంది. డ్రగ్స్ అక్రమ రవాణాకు సంబంధించిన వ్యక్తులు, వారి ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే ఈగల్ ఫోర్స్‌కు తెలియజేయాలని సూచించారు. తెలంగాణలో డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఈగల్ ఫోర్స్ చర్యలు కొనసాగుతున్నాయి; ఇటీవలి కాలంలో ఆ విభాగానికి జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించినట్లు తాజా నివేదికలు పేర్కొన్నాయి.

# తార్నాక ఎర్రకుంట వాటర్ బాడీ పరిరక్షణకు పాదయాత్ర: అబ్దుల్ మన్నన్



**దశ ఓయూ:** అన్యాక్రాంతం దశలో ఉన్న తార్నాక ఎర్రకుంట వాటర్ బాడి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనీ కోరుతూ బుధవారం తార్నాక కాలనీల అసోసియేషన్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. ఆక్రమణకు గురైతున్న ఎర్రకుంట చెరువు భూములను ప్రాంతాన్ని పరిశీలించారు. ఓ అపార్టుమెంట్కు ఓ వ్యక్తి అనధికారికంగా చెరువు ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ నుంచి అప్రోచ్ మట్టి రోడ్డు వేస్తుంటంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరిగేషన్, రీవెన్యూ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం నిలిపివేయాలనీ కోరారు. కాలనీ వాసులంతా కలిసి ఎర్రకుంటలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తార్నాక వాసులు,కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ మన్నన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా అధికారులు స్పందించి తార్నాక ఎర్రకుంట పరిరక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లుబ్నా. జలంధర్రెడ్డి, నవీన్, నరేష్, శంకర్రావు తదితరులున్నారు.

# ఆరోగ్య సేవల్లో సమర్థత పెంచాలి

❖ *సిబంది సమయపాలన, రోస్టర్ డ్యూటీలపై ప్రత్యేక దృష్టి*



**దశ, రంగారెడ్డి:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఆరోగ్య సేవలపై ACLB డా. కిరణ్మయి, DMHO డా. స్వర్ణకుమారి సమీక్ష నిర్వహించారు. DM&HO కార్యాలయంలో జరిగిన సమావేశానికి Dy.DMHOలు, ప్రోగ్రాం అధికారులు, మెడికల్ ఆఫీసర్లు హాజరయ్యారు.

జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది విధులకు సమయపాలన పాటించాలని అధికారులు సూచించారు. 24x7 ఆసుపత్రుల్లో రోస్టర్ ప్రకారం విధులు నిర్వహించేలా పర్యవేక్షణ ఉండాలని, క్షేత్రస్థాయి సేవలను మరింత పటిష్ఠం చేయాలని ఆదేశించారు. జూనియర్ వైద్యుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసి, వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు.

జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులు పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా సహకార లోపం కనిపిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

NHM ద్వారా డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కింద రూ.98 లక్షలు విడుదల చేసినట్లు DMHO డా. స్వర్ణకుమారి తెలిపారు. మిగిలిన రూ.2 లక్షలు కూడా త్వరలో క్లియర్ చేస్తామని వెల్లడించారు.




# పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత యునాని వైద్యం

❖ *చౌటుప్పల్‌లో వైద్య శిబిరం.. ఉచితంగా మందుల పంపిణీ*



**దశ, చౌటుప్పల్:** 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత యునాని వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ యునాని పురాతన వైద్య విధానాల్లో ముఖ్యమైనదని, ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోజ్ మేరీ, కౌన్సిలర్లు బద్రి గాలయ్య, పాక చిరంజీవి, ఊదరి యాదయ్య, అధికారులు, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# లడ్డూ వేలంలో జోరు..


## రూ.9.10 లక్షలకు దక్కించుకున్న కేతిరెడ్డి

❖ *సదాశివ హెవెన్స్‌లో ఘనంగా వినాయక నవరాత్రి వేడుకలు*



**దశ, పెద్ద అంబర్‌పేట:** పెద్ద అంబర్పేట్ పరిధిలోని సదాశివ హెవెన్స్‌లో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం ఘనంగా జరిగింది. ఈ వేలంలో సదాశివ హెవెన్స్ అధ్యక్షుడు కేతి రెడ్డి శిల్ప-ప్రవీణ్ కుమార్ రెడ్డి రూ.9 లక్షల 10 వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. వినాయకుడి ఆశీస్సులతో నిర్వహించిన ఈ లడ్డూ వేలానికి కాలనీ వాసుల నుంచి విశేష స్పందన లభించింది. భారీ మొత్తానికి లడ్డూ వేలం కావడంతో ఉత్సవ ప్రాంగణంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేలం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సదాశివ హెవెన్స్‌లో ప్రతి ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని, కాలనీ వాసుల సహకారంతో ఈ ఏడాది వేడుకలు మరింత ఘనంగా సాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

# నీటి వృథాకు జలమండలి చెక్!



❖ *జూబ్లీహిల్స్‌లో ఐదుగురికి జరిమానా.. గరిష్ఠంగా రూ.20 వేలు*

**దశ, హైదరాబాద్:** తాగునీటి వృథాను అరికట్టేందుకు జలమండలి కఠిన చర్యలు చేపట్టింది. జూబ్లీహిల్స్‌లో వాహనాలు, ఫ్లోర్‌లు కడగడానికి తాగునీటిని వినియోగించిన ఐదుగురికి జరిమానాలు విధించింది. నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి రూ.1,000 నుంచి రూ.20 వేల వరకు ఫైన్ విధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పదేపదే నీటిని వృథా చేస్తే నల్లా కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు. నీటి దుర్వినియోగంపై 99499 30003 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.




# న్యాయవాదుల సంక్షేమానికి నిధులు పెంచాలి

❖ *ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ డిమాండ్*

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** న్యాయవాదుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విస్మరిస్తున్నాయని, న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఐలు జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు సముదాయం ఎదుట ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో న్యాయవాదులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. ధర్నాను ఉద్దేశించి కొల్లి సత్యనారాయణ, ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యుడు జలసూత్రం శివరాంప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్ ప్రసంగించారు.

సమాజంలో ఇతర రంగాల వారితో పోలిస్తే న్యాయవాది మరణించినప్పుడు ఇచ్చే రూ.10 లక్షల డెత్ రిటైర్మెంట్ బెనిఫిట్ ఏమాత్రం సరిపోదని, దీనిని తక్షణమే రూ.25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రస్తుతం ఇస్తున్న రూ.2 లక్షల వైద్య సహాయం ఏ మూలకూ చాలదని, ఆరోగ్య బీమా పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. న్యాయవాద వృత్తిలోకి కొత్తగా అడుగుపెట్టే జూనియర్ న్యాయవాదులు కేసులు లేక, నిత్య ఖర్చులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారు వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఐదేళ్ల పాటు నెలకు రూ.10,000 చొప్పున స్టైఫండ్ అందించాలని కేంద్ర న్యాయవాదుల సంక్షేమ నిధిని డిమాండ్ చేశారు. ఐలు చేపట్టిన ఈ పోరాటానికి కొత్తగూడెం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ ముదుల్కర్, ప్రధాన కార్యదర్శి జి. మహేశ్వరరావు, ఐఏఎల్ బాధ్యులు వై. ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

# నయీం హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్!

❖ *ప్రధాన సూత్రధారి ఉమామహేష్ సహా ముగ్గురు అదుపులో*
❖ *11కు చేరిన అరెస్టుల సంఖ్య*



**దశ, హైదరాబాద్:** బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ మహమ్మద్ నయీం హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా మరో ముగ్గురిని నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మంకు చెందిన కె. ఉమామహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)ను ఎల్‌బీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీంపై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా మరో ముగ్గురి అరెస్టుతో మొత్తం నిందితుల సంఖ్య 11కు చేరింది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. నయీం, ఉమామహేష్ బాల్య స్నేహితులు. ఇద్దరిపై ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

కొంతకాలంగా ఇల్లందు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లు చేస్తున్న క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నయీంను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమామహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించినట్లు పోలీసులు వెల్లడించారు. మరుసటి రోజు ఖమ్మం నుంచి కారులో హైదరాబాద్‌కు చేరుకున్న నిందితులు.. మున్నా ద్వారా నయీంకు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నట్లు తెలిపారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీం ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి కారం చల్లి, వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్ డీసీపీ బి. అనురాధ, ఎస్‌ఓటీ ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో నాగోల్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన సూత్రధారి ఉమామహేష్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.

## మణికేశ్వరి నగర్‌లో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజల్లో..ఆలకుంట సరస్వతిహరి



**దశ ఓయూ:** మణికేశ్వరి నగర్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

## నాచారం జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో పోక్సోపై అవగాహన




**దశ ఓయూ:** నాచారం మెయిన్‌రోడ్డులోని జాన్సన్ గ్రామర్ స్కూల్ (ఐసీఎస్ఈ)లో బుధవారం పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఐ వరుణ్ కాంత్ రెడ్డి, ఎస్ఐ మైబెల్లీ హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాలల భద్రత, బాలలపై లైంగిక నేరాల నివారణ, పాఠశాల సిబ్బంది బాధ్యతలపై అవగాహన కల్పించారు. బాలల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## తార్నాకలో గణనాథుడికి ప్రత్యేక పూజలు



**దశ ఓయూ:** తార్నాక స్ట్రీట్ నంబర్-1లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ఆర్టీఏ సభ్యుడు సురేశ్ లాల్ నేతికర్, కాంగ్రెస్ నాయకుడు మానన్, కమలేష్ యాదవ్ తదితరులు పాల్గొని గణనాథుడికి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## మల్లాపూర్ లో ఫుడ్ సేఫ్టీపై అవగాహన



**దశ, ఓయూ:** 'గణేష్ సురక్ష సంకల్ప్-2026' కార్యక్రమంలో భాగంగా JNNRM మల్లాపూర్ చారి ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో DI వరుణ్ కాంత్ రెడ్డి, SI మైబెల్లీ పాల్గొని ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులకు ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యమైన ఆహారం వినియోగం, ఫుడ్ సేఫ్టీ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆహారం ద్వారా వచ్చే అనారోగ్యాలను నివారించే చర్యలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, సురక్షితమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు.

## గణపతి లడ్డూ వేలం

*రూ.1.08 లక్షలకు దక్కించుకున్న గండికోట కుమార్*



**దశ, ఓయూ:** మాణికేశ్వరి నగర్‌లో శ్రీరామ గండికోట సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి లడ్డూ వేలంపాటను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలంపాటలో డీసీసీ ప్రధాన కార్యదర్శి, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు గండికోట కుమార్ పోటీపడి రూ.1,08,000కు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## చెంగిచెర్లలో ఉత్సాహంగా లడ్డూ వేలం

*రూ.32 వేలకు గణనాథుడి లడ్డూను దక్కించుకున్న సిద్ధులు కుటుంబం*



**దశ ఓయూ:** శ్రీ మణికంఠ కాలనీలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మణికంఠ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ఈ వేలంలో సిద్ధులు కుటుంబ సభ్యులు రూ.32 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యుల చేతుల మీదుగా సిద్ధులు కుటుంబ సభ్యులకు లడ్డూను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ వారు ,మహిళలు, చిన్నారులు, భక్తులు పాల్గొన్నారు.

# శివసాగర్ లో ఇసుక దందాకు సిద్ధం



- పోలీస్ భద్రత మధ్య ఇసుక దందా ప్రారంభం
- పెద్దల హుకూం జారీ
- పోలీసు శాఖ అప్రమత్తం
- నేడో రేపో తవ్వకాలు ప్రారంభం
- అడ్డుకుంటామని రైతుల ప్రకటన
- పార్టీలకు అతీతంగా ఏకమైన ప్రజలు
- శివసాగర్ ప్రాజెక్టు చుట్టూ రాజకీయం

**తాండూర్, దశ ప్రతినిధి**

తాండూరు నియోజకవర్గంలోని శివసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంతం నుంచి ఇసుక రవాణా రాజకీయ దుమారం రేపుతోంది. ఈ ప్రాజెక్టులో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు సాగునీటి శాఖ పరిధిలో ఉంది. దీంతో ప్రాజెక్టులో పూడిక లేదా ముంపు ప్రాంతంలోని ఇసుక తరలింపునకు సాగునీటి శాఖ ఎలాంటి అనుమతులు జారీ చేసే అవకాశం లేదు. ఈ ఇసుక తరలింపునకు పర్యావరణ అనుమతి తప్పనిసరిగా మారింది. ఇసుక తరలింపునకు ప్రత్యమ్నాయ మార్గాలు లేకపోవడంతో కొందరు పెద్దలు అధికారాన్ని అడ్డంపెట్టుకొని, అధికారులపై ఒత్తిడి తీసుకవచ్చి ఇసుక రవాణాను ప్రారంభించారు. టిప్పర్లు, భారీ యంత్రాలతో ఇసుకను తరలిస్తున్నారు. ఈ ఇసుక అంతా కూడా పక్కనే ఉన్న కొడంగల్ నియోజకవర్గానికి వెళుతోంది. అక్కడ జరిగే అభివృద్ధి పనులకు ఇసుకను వినియోగిస్తున్నారు. గతవారం ఇసుక రవాణాను స్థానిక గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. దీంతో ఇసుక రవాణా నిలిచిపోయింది.



### పోలీసు రక్షణతో ఇసుక రవాణా

ఎలాగైనా శివసాగర్ ప్రాజెక్టు నుంచి ఇసుక తరలింపును ప్రారంభించేందుకు పెద్దలు సామ.. దాన.. బేధ.. దండోపాయాలను అనుసరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం పోలీసు శాఖ సిబ్బంది మొత్తంను గణేష్ నిమజ్జన వేడుకలలో బందోబస్తుకు వినియోగిస్తున్నారు. ఈ వేడుకలు ముగిసిన వెంటనే తిరిగి శివసాగర్ ప్రాజెక్టు నుంచి ఇసుక రవాణాకుఏర్పాట్లు పూర్తి చేశారు. నేడోరేపో తిరిగి ఇసుక రవాణా ప్రారంభం అవుతుందని సమాచారం.

ఇసుక రవాణాను ఎవరు అడ్డుకున్నా కేసులు నమోదు చేయాలని.. అరెస్టు చేయాలని పైనుంచి ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలతో శివసాగర్ ప్రాజెక్టు నుంచి ఇసుక తరలింపు వివాదం మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తోంది. ప్రాజెక్టు నుంచి ఇసుక తరలింపును యాలాల, విశ్వనాథ్పూర్, దేవనూర్, గోవిందరావుపేట్ గ్రామాల ప్రజలు అడ్డుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు మరింత పడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### అటు పెద్దలు..ఇటు రైతులు

శివసాగర్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలు, నేతలు పార్టీలకు అతీతంగా ఏకమవుతున్నారు. ఎట్టిపరిస్థితులలో కూడా ఇసుక రవాణా జరగకుండా చూడాలని రైతులు, ప్రజలు, నేతలు నిర్ణయించారు. ఇందుకు పెద్ద ఎత్తున నిరసన తెలిపేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇసుక తరలింపుపై అభ్యంతరం తెలుపుతున్న వారిలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్లు, నేతలు కూడా ఉన్నారు. ఇసుక తరలింపు వ్యవహారం ప్రజా ఉద్యమానికి దారితీసే అవకాశం కనిపిస్తోంది. ఇసుక తరలింపును నిలిపివేయాలని రైతులు భారీ ఎత్తున జిల్లా కలెక్టర్ను కలిసి వినతిపత్రం కూడా అందజేశారు. ఒకవైపు ఎలాగైనా ఇసుక తరలింపు ఆగవద్దు అని పెద్దలు.. మరోవైపు తరలింపు జరగరాదని రైతులు పట్టుదలతో ఉండడంతో శివసాగర్ ప్రాజెక్టు కేంద్రంగా రాజకీయ దుమారం రేగడం ఖాయంగా కనిపిస్తోంది



## హయత్‌నగర్‌లో కల్తీ పేస్ట్ దందా.. 730 కిలోలు సీజ్

- *గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్ స్వాధీనం.. ఒకరు అరెస్ట్*





**దశ, హయత్ నగర్ :** హయత్‌నగర్‌లో అనుమానిత కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. మల్కాజ్‌గిరి ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (MFAST), ఎస్ఓటీ ఎల్బీనగర్, హయత్‌నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడిలో సుమారు 730 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. శివశక్తినగర్‌లోని శ్రీ మాణికంఠ (SMK) గోల్డెన్ ఫుడ్ ప్రొడక్ట్స్ అండ్ జింజర్‌గార్లిక్ పేస్ట్ తయారీ కేంద్రంలో సెప్టెంబర్ 22న తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 730 కిలోల పేస్ట్‌తో పాటు 3.5 లీటర్ల గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్ స్వాధీనం చేసుకున్నారు. పేస్ట్‌ను అపరిశుభ్రమైన పరిస్థితుల్లో, నిర్దేశిత ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

తక్కువ నాణ్యత గల ముడి పదార్థాలతో పాటు గుర్తుతెలియని ద్రావణం, ఫుడ్ కలర్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో హయత్‌నగర్ డిఫెన్స్ కాలనీకి చెందిన *ఆకుల శివయ్య (38)ను అరెస్ట్ చేశారు. వివిధ ప్యాకింగ్ సైజుల్లో పేస్ట్ తయారు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పేస్ట్‌లో 50 కిలోల చొప్పున 13 డ్రమ్ములు, 5 కిలోల చొప్పున 10 బాక్సులు, 200 గ్రాముల చొప్పున 150 బాక్సులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కల్తీ ఆహార పదార్థాల వినియోగంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 1534/2026 కింద BNS సెక్షన్లు 223, 274, 275 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి పోలీసులు హెచ్చరించారు..



## పీర్జాదిగూడలో ఉత్సాహంగా లడ్డూ వేలం

- *రూ.99 వేలకు లడ్డూను దక్కించుకున్న ఆకుల మధుకర్*

**దశ, ఓయూ:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పీర్జాదిగూడ డివిజన్‌లోని నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూ వేలం మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. వేలంలో బీఆర్ఎస్ నాయకుడు ఆకుల మధుకర్ రూ.99 వేలతో లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా మధుకర్‌కు లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా జక్కా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, కుర్ర శ్రీకాంత్ గౌడ్, చెరుకు మహేష్ గౌడ్, అలువాల దేవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

- *ముషీరాబాద్ మండల రెవెన్యూ అధికారులను కోరిన మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి*



**దశ, ఓయూ:** పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ విచారణ పూర్తి చేసి త్వరితగతిన పెన్షన్లు మంజూరు చేయాలని తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి ముషీరాబాద్ మండల రెవెన్యూ అధికారులను కోరారు. సెప్టెంబర్ 15 వరకు పెన్షన్ దరఖాస్తులకు అవకాశం ఉండటంతో గతంలో మాణికేశ్వరి నగర్‌లో ఆమె ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో బుధవారం మాణికేశ్వరి నగర్‌లో ముషీరాబాద్ మండల రెవెన్యూ అధికారులు పర్యటించి పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలకుంట సరస్వతి మాట్లాడుతూ.. దరఖాస్తులపై సమగ్ర విచారణ నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాము మాట్లాడుతూ అర్హులైన పెన్షన్‌దారులకు త్వరగా పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కులమతాలకు అతీతంగా వినాయక మండపాల్లో వస్త్రాల పంపిణీ



**దశ, ఓయూ:** కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ అబ్దుల్ మన్నన్ ఆధ్వర్యంలో తార్నాక డివిజన్‌లోని వివిధ వినాయక మండపాల వద్ద భక్తులకు లాల్చి పైజామాలను ఉచితంగా పంపిణీ చేశారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డివిజన్‌లోని ప్రతి మండపాన్ని సందర్శించిన ఆయన భక్తులకు వస్త్రాలను అందజేశారు. కులమతాలకు అతీతంగా భక్తి, సౌభ్రాతృత్వాన్ని చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించడంతో మండపాల నిర్వాహకులు అబ్దుల్ మన్నన్‌ను అభినందించారు.